మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# అమరుల యాది ఏది.?



**అచ్చంపేట, డిసెంబర్ 03, ప్రభాతవార్త:** త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరులైన ఉద్యమకారులకు రుణపడి ఉంటామని, వారిని యావత్ తెలంగాణ ప్రజలు మదిలో ఉంచుకునేలా చేస్తామని సభలు, సమావేశాల్లో ప్రగల్భాలు పలికిన నేతలు తొలి అమరుడిని యాది మరిచారు. తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాటి ఉద్యమకారుడు నేటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చూపిన బాటలో ఉద్యమానికి ఊపిరి పోస్తూ ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఉస్మానియా క్యాంపస్‌లో విద్యార్థులను చైతన్యపర్చడమే కాకుండా పల్లె పల్లెన తెలంగాణ నినాదం బలపడే విధంగా చదువును ప్రక్కకు పెట్టి గ్రామాల్లో పర్యటిస్తూ ఉద్యమానికి ఊపిరి పోసిన అమరులను యాది చేయడంలో నేటి తెలంగాణ నాయకులు విఫలమయ్యారనే చెప్పుకోవచ్చు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న తరుణంలో అనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా ప్రకటన చేయకపోవడంతో నా చావుతోనైనా తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చాలు అనుకొని హైదరాబాద్ నడిబొడ్డున పెట్రోల్ పెసుకొని నిప్పటించించుకొని జై తెలంగాణ నినాదాలు చేసి అమరుడైనా కాసోజు శ్రీకాంతాచారి వర్థంతి వేడుకలను జరపకపోవడం తెలంగాణ ఉద్యమకారులను అవమానపరిచినట్లే. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన జరుగుతుందనే ఆశాభావంతో అమరుడైన శ్రీకాంతాచారి కలలు కన్న రాష్ట్రంలో శ్రీకాంతాచారిని యాది చేయకపోవడం అమరుల ఆత్మ ఘోషిస్తుంది. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు, విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకొని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాదులు వేస్తే రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ అమరులను యాది చేయకపోవడం శోచనీయంగా మారింది. తెలంగాణ రాష్ట్రంలో అచ్చొచ్చిన అచ్చంపేటగా పేరొందిన నియోజకవర్గంలో గెలుపొందిన అభ్యర్థి పార్టీనే పాలన కొనసాగిస్తుంది అన్న నానుడి ఉన్న ఈ నియోజకవర్గ కేంద్రంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి వర్థంతి నోచుకోకపోవడం విడ్డూరంగా మారింది. మండుతున్న కాగడనై అనాటి ఆంధ్ర పాలకుల చరసాల నుంచి తెలంగాణ రాష్ట్రానికి విముక్తి పరిచేందుకు నేను సిద్ధమని, ఆత్మబలిదానం చేసుకొని నాలాంటి విద్యార్థులకు నిరుద్యోగ సమస్య ఉండకూడదని, అమరుడైన కాసోజు శ్రీకాంతాచారి వర్థంతి వేడుకలు మరువడం న్యాయమా.?, అదే విధంగా వంగూరు మండలంలో కూడా గత 3 సంవత్సరాలుగా తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి వర్థంతి, జయంతి జరపకుండా, అమరులను గుర్తు చేయకపోవడమేమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

## అమర్ రాజా బ్యాటరీస్ పరిశ్రమ తెచ్చినందుకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు

### టిఆర్ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదీప్

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 3 ప్రభాతవార్త :** ఒకప్పుడు వలసల జిల్లాగా ఉన్న మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, ఐటి, ఇండస్ట్రియల్ కారిడార్‌గా మారుస్తున్న ఘనత రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి.శ్రీనివాస్‌గౌడ్‌కే దక్కుతుందని టిఆర్ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదీప్ తెలిపారు. మహబూబ్‌నగర్ న్యూటౌన్‌లో ఉన్న టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మహబూబ్‌నగర్ సమీపంలో దివిటిపల్లి వద్ద ఐటీ, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయగా, అమర్ రాజా బ్యాటరీస్ గ్రూప్ 250 ఎకరాల్లో సుమారు రూ. 10 వేల కోట్లతో లిథియం అయాన్ బ్యాటరీలు తయారు చేసే భారీ పరిశ్రమను తీసుకువచ్చినందుకు సీఎం కెసిఆర్, మంత్రులు కెటిఆర్, శ్రీనివాస్‌గౌడ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 10 వేల మంది వరకు ఉపాధి అందించే ఈ పరిశ్రమను మహబూబ్‌నగర్‌కు తీసుకువచ్చి పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అందరూ అన్నారని సుదీప్ తెలిపారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని తెలిపారు. టిఆర్ఎస్‌వి నాయకులు నాని, శివ, సత్యపాల్, మనీష్, బాలు, కార్తీక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా త్రిచక్ర వాహనం బహుకరించిన మంత్రి సింగిరెడ్డి..

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 03 ప్రభాతవార్త:** కళాశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న గోపాల్‌పేట కు చెందిన డిగ్రీ సంవత్సరం విద్యార్థి జి.పవన్‌కుమార్ కు సింగి రెడ్డి నిరంజన్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరుపున త్రిచక్ర వాహనాన్ని శనివారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేసిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ చంద్రమోహన్ రెడ్డి, కృపానందం గౌడ్, బుచ్చిబాబు, రాఘవేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పవన్ కుమార్‌కు త్రిచక్ర వాహనాన్ని అందిస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి

# దివ్యాంగులకు అన్ని రంగాల్లో.. ప్రాధాన్యం..!





సీఎం కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

### దివ్యాంగులకు అండగా తెలంగాణ ప్రభుత్వం..
### దేశంలో రూ.3016 పింఛన్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
### ప్రపంచ దివ్యాగుల దినోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 3 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి, వారి హక్కుల రక్షణకు అండగా ఉంటున్నదని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. డిసెంబర్ 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని మంత్రి తెలిపారు. సమైక్య రాష్ట్రంలో కేవలం రూ. 200లు వచ్చే పెన్షన్ ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రత్యేక శ్రద్ధ వల్ల రూ. 3016 అందిస్తున్న ఏకైక రాష్ట్రమని పేర్కొన్నారు. గతంలో దివ్యాంగులు కనీసం తాగునీటిని తెచ్చుకునేందుకు కూడా ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఇంటింటికి మిషన్ భగీరథ నల్లాల ద్వారా శుద్ధజలం అందుతుందన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ట్రై సైకిళ్లు, బ్యాటరీ వాహనాలు అందిస్తున్నామని, అన్ని రంగాల్లో వారికి ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి వివరించారు. దివ్యాంగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి కెసిఆర్‌కు దివ్యాంగులతో కలిసి మంత్రి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ముడా ఛైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, వైస్ ఛైర్మన్ గణేష్, జిల్లా సంక్షేమ అధికారి జరీనా, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ చెరుకుపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హాజరైన దివ్యాంగులు

# సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి







సీఎం కెసిఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి,మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి,ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 3 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ నేడు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవం, ఎంవిఎస్ కళాశాల మైదానంలో జరగనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు డా. లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపి రాములు, డిసిసిబి ఛైర్మన్ నిజాంపాషా, టిఎస్ఐఐసి ఛైర్మన్ బాలమల్లులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కెసిఆర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సుమారు 14 లక్షల మంది ఇతర రాష్ట్రాలకు, ప్రాంతాలకు వలసలు వెళ్లి నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. నాడు వలసల జిల్లా అయితే నేడు లక్షలాది మందికి పాధి అవకాశాలు, ఉద్యోగాలు కల్పించే స్థాయికి జిల్లాను సీఎం కెసిఆర్ అభివృద్ధి చేస్తున్నారన్నారు.

**దేవరకద్రలో...**

మహబూబ్‌నగర్‌లో ఆదివారం జరిగే ముఖ్యమంత్రి సభను విజయవంతం చేద్దామని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకు ముఖ్యమంత్రి రాక సందర్భంగా శనివారం దేవరకద్ర నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన దాదాపు 6 వేల మంది ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ఆల టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వనపర్తికి ముఖ్యమంత్రి వచ్చినప్పుడు దేవరకద్ర నియోజకవర్గం నుండి పార్టీ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్ళి విజయవంతం చేశారన్నారు. దీని వెనుక పార్టీ నాయకుల కృషి చాలా ఉందన్నారు. అలాగే ప్రస్తుతం కూడ అదే తరహాలో ఇప్పుడు కూడ మహబూబ్‌నగర్‌లో జరిగే ముఖ్యమంత్రి సభను కూడ విజయవంతం చేయాలన్నారు.

### ముఖ్యమంత్రి సభను విజయవంతం చేద్దాం
- 6 వేల మంది ముఖ్యనాయకులు, కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్
- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

## పల్లె దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే..



పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**నారాయణపేట,డిసెంబరు 3 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గంలోని మాగనూరు మండలం వడ్వాట్ గ్రామంలో వాటర్ ట్యాంకును, అదేవిధంగా జిల్లా డిఎంహెచ్‌ఓతో కలిసి పల్లె దవాఖానను ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు ధనిక, బీద తారతమ్యం లేకుండా ప్రతి పల్లెలో ఉచితంగా వైద్యం అందించాలని ధృఢ సంకల్పంతో ప్రభుత్వం పల్లె దవాఖానాలను ప్రారంభించిందని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా పల్లె దవాఖానాలను వినియోగించుకోవాలని అన్నారు. అదేవిధంగా మిషన్ భగీరథ ద్వారా నేడు ఈ గ్రామంలో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించి ప్రతిఇంటికి నల్ల కలెక్షన్లను ఇవ్వడం జరిగిందని ఇంటింటికి త్రాగునీరు అందించాలనే ధృడ సంకల్పంతో మిషన్ భగీరథ ద్వారా ఈ వాటర్ ట్యాంక్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా డిఎంహెచ్‌ఓ రామ్‌మనోహర్‌రావు, మాగనూరు జడ్పీటిసి వెంకటయ్య, ఎంపిపి శ్యామలమ్మ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, గ్రామ యువకులు, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్..!

వరుసకు బాబాయ్.. మరికొందరు యువకులు కలిసి రేప్ చేసినట్లు సమాచారం..
చిన్నరేవల్లిలో ఆందోళనలు..
కారుకు నిప్పంటించిన బంధువులు..
మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు..
పరామర్శించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



వివరాలు మెయిన్ పేజీలో..

రోదిస్తున్న మృతురాలి బంధువులు (ఇన్‌సెట్లో) జయశ్రీ (ఫైల్)

## వైకల్యాలను అధిగమించి జీవితంలో రాణించాలి...

### - నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 03, ప్రభాతవార్త:** వైకల్యంతో ఎన్నో అవరోధాలను, కష్టాలను ఎదుర్కొంటూ జీవితాన్ని జయిస్తూ మనందరికి స్పూర్తిని ఇస్తున్న దివ్యాంగులకు మనం కూడా చేయూతనందించి, వారిని గౌరవించి అభిమానిద్దామని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక వెలమ ఫంక్షన్‌హాల్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజల్వన చేసి దివ్యాంగులకు రూ.45 లక్షల రూ॥లతో 5 మంది శారీరక దివ్యాంగులకు ఐదు బ్యాటరీ వాహనాలు, 10 ట్రైసైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం, ఉద్యోగులు అండగా నిలువాలని సూచించారు. దివ్యాంగులు వైకల్యాన్ని అధిగమించి స్వయం ఉపాధిలో రాణించాలని కోరారు. ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లాలని కోరారు. దివ్యాంగులు విన్నవించిన సమస్యలను పరిశీలించి, పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. సదరం క్యాంపుల స్లాట్లను 90 నుంచి 150 వరకు పెంచేలా కృషి చేస్తామన్నారు. అర్హతలు, సామర్థ్యాలు ఉన్న ప్రతి ఒక్కరు తమ లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. దివ్యాంగులను ఉపాధి హామీ శ్రమశక్తిల 425 సంఘాల్లో 2883 మందిని సభ్యులుగా చేర్పించామని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 13,371 మంది దివ్యాంగులకు ఆసరా పింఛన్ ద్వారా రూ॥40,32,6936 లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మాసం విడుదల చేస్తుందన్నారు. ఇటీవల నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. దివ్యాంగ హక్కుల కరదీపికను విడుదల చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ కల్పన భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ దివ్యాంగులు పట్టుదల ఉంటే అన్ని రంగాల్లో రాణించగలుగుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి వెంకటలక్ష్మి, డీఆర్‌డీఎ పీడీ నర్సింగరావు, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, మున్సిపల్ కమీషనర్ జయంత్‌కుమార్, సెక్టోరిల్ అధికారి బరపటి వెంకటయ్య, సంఘం నాయకులు రాజశేఖర్, గౌతమ్, బాలీశ్వర్, రవి, శంకర్, నిరంజన్, నారాయణమ్మ, నిర్మల, బాలపిర్, నిరంజన్, సచ, కోఆర్డినేటర్ సునీత, చైల్డ్ ప్రోటెక్షన్ చైర్మన్ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న దృశ్యం

## అత్యాచార ఘటన బాధాకరం..!

### దోషులను కఠినంగా శిక్షిస్తాం...
### బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకుంటాం : జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**రాజాపూర్,డిసెంబరు 3 ప్రభాతవార్త :** బాలానగర్ మండలం తిరుమలగిరి గ్రామ పరిధిలోని కెన్యనాయక్ తండాలో పదవ తరగతి విద్యార్థినిపై కొందరు వ్యక్తులు అత్యాచారం జరిపి చంపిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బాదేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థిని మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అత్యాచార ఘటన బాధాకరం అని నిందితులు ఎవరైనా సరే శిక్షించాలని పోలీస్ శాఖను ఆదేశించారు. నిందితులకు త్వరగా శిక్ష పడేలా ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామని తెలిపారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వం తరపున ఆదుకుంటామని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

# విశ్వ మానవాళికి పూజనీయ గ్రంథం భగవద్గీత

## విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా గీతాజయంతి.. విద్యార్థులకు బహుమతుల ప్రధానం

**మక్తల్,డిసెంబరు3 ప్రభాతవార్త:** స్థానిక మక్తల్ పట్టణంలో శ్రీ షిరిడీ సాయి సత్యసాయి మందిరంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఘనంగా గీతాజయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని చిత్రపటం, భగవద్గీత గ్రంథానికి ఘనంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సామూహిక భగవద్గీత శ్లోకాలను ఆలపించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్రరావు, విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి వి. భీంరెడ్డి మాట్లాడుతూ విశ్వమానవాళికి పూజనీయ గ్రంథం భగవద్గీత అని ప్రపంచంలో ఏ గ్రంథాలకు (పుస్తకమునకు) లేని జయంతి వేడుకలు జరుపుకునే గ్రంథం భగవద్గీత అని, అందుకే ప్రతి సంవత్సరం మార్గశిర శుద్ధ ఏకాదశి రోజు గీతా జయంతిని ఘనంగా జరుపుకుంటారని చెప్పారు. సుమారు 5200ల సంవత్సరాల క్రితం సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి బోధించిన సర్వ వేదాల, సర్వ ఉపనిషత్తుల సారమే భగవద్గీత అని అన్నారు. భగవద్గీతలో 700ల శ్లోకాలతో 18 అధ్యాయాలతో వేద, వేదాంత, యోగవిశేషాలు ఉన్నాయని చెప్పారు. గాఢ అంధకారమైన మానవ జాతిపై వెలుగులు విరజిమ్ముతూ భగవద్గీత ఉదయించింది. ఇది విశ్వమానవాళికి పూజనీయ గ్రంథం అని కొనియాడారు. సాక్షాత్తు శ్రీ కృష్ణుడే గురువుగా అవతరించి అర్జునుడికి చేసిన కర్తవ్య బోధనే భగవద్గీత అని, భగవద్గీత పఠనం ప్రతివ్యక్తి కర్తవ్యం నిర్వహణకు, పాప నివారణకు, ముక్తికి మార్గము అని,ఎందరో మహనీయులు, యోగులు, తాత్వికులు భగవద్గీత నుండి మార్గదర్శకత్వం పొంది తరించారని చెప్పారు. నేడు ప్రపంచ దేశాలు సైతం భగవద్గీతను అనుసరిస్తూ, భగవద్గీతను పూజనీయ గ్రంథంగా ఆరాధిస్తున్నారని చెప్పారు. చిన్ననాటి నుండే భగవద్గీత శ్లోకాలు సంస్కారం, ఆధ్యాత్మిక చింతన, నైతిక విలువలు, దైవభక్తి, సన్మార్గంలో నడవడం, క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. అనంతరం భగవద్గీత కంఠస్థ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, భగవద్గీత పుస్తకాలు అందించడం జరిగింది.

కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి వి. భీంరెడ్డి, బిలకంటి రఘునాథ్, ప్రఖండ అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, మండల అధ్యక్షులు మాద్వార్ డా. ఆశప్ప, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, భజరంగ్‌దళ్ జిల్లా సహ ప్రముఖ్ వాకిటి రమేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు శ్రీనివాస్, జయలక్ష్మి, నీలమ్మ పాల్గొన్నారు.



గీతాజయంతి ఉత్సవాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

# మాలధారణం..నియమాలతోరణం..

**- దేవరకద్రలో ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ - ఆకట్టుకొన్న అశోక్‌రెడ్డి బృందం భక్తిపాటలు**

**- గురుస్వామి కరుణంరాజు అధ్వర్యంలో పూజ**

**దేవరకద్ర,డిసెంబరు03ప్రభాతవార్త:** దేవరకద్రలో శనివారం అభిషేకప్రియుడు అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మ్యాదరి శ్రావణ్‌స్వామి ఇంటి ఆవరణలో గురుస్వామి కరుణంరాజుస్వామి అధ్వర్యంలో ఆ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజలో అశోక్‌రెడ్డి ఆర్కెస్ట్రా బృందం ఆలపించిన భక్తిపాటలు ఎంతగానో ఆకట్టుకొన్నాయి. ఈ సందర్భంగా స్వామివారి ధర్మశాస్త్రను రకరకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 18పడి మెట్లను రకరకాల పూలతో పాటు వివిధ పండ్లతో అలంకరించి పూజలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని కన్నులపండువలా నిర్వహించారు.


దేవరకద్రలో అయ్యప్పస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

**వైభవంగా స్వామివారికి అభిషేకాలు..**

పడిపూజ సందర్భంగా అభిషేక ప్రియుడికి వివిధ అభిషేక కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో దైవగీతాలాపనలు చేసిన ఈ పవిత్ర పూజా కార్యక్రమంలో అయ్యప్పస్వాములతో పాటు భక్తులు భక్తిపారవశ్యంతో పులకించి పోయారు. పూజలో పాల్గొని తన్మయం చెందారు. ఈ సందర్భంగా స్వామివారికి కుంకుమ,గంధం,పండ్లు,తేనె,పాలు,పెరుగు,పూలతో పాటు వివిధ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వాములకు (భిక్ష) అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పడిపూజ జరిగే ప్రాంతాన్ని భక్తిభావం ఉట్టిపడేలా అలంకరించారు. అయ్యప్పస్వాములు చేసిన అయ్యప్పస్వామి నామస్మరణతో పూజా ప్రాంత ం మారుమోగింది. పవిత్ర వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన అయ్యప్పస్వాములతో పాటు వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్పస్వాములు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీలు అమలు చేసిన తర్వాతే ప్రకటించాలి

**ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రతిపక్షాల ముందస్తు అరెస్టులు**

**మక్తల్,డిసెంబరు 3 ప్రభాతవార్త :** గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఆ తర్వాత జిల్లాలో పర్యటించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ముఖ్యమంత్రి కెసిఆర్ మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులను శనివారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో దొంగ హామీలు ఇచ్చి ఓట్లు వేసుకుని ముఖ్యమంత్రి జిల్లా ప్రజలను మోసం చేశారన్నారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నారాయణపేట జిల్లాకు నీళ్లు ఇస్తామని చెప్పి ఓట్లు వేసుకుని గెలిచి ఎనిమిది ఏళ్లయిన నేటికి సాగునీరు ఇవ్వలేదన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకులు చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని గుర్తించి వారికి వెంటనే ఎస్టీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు మంజూరు చేసిన సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ వస్తే దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం ఇస్తామంటూ హామీలను ఇచ్చిన ముఖ్యమంత్రి వాటని అమలు చేయాలని కోరితే పోలీసులను అడ్డం పెట్టుకుని అక్రమంగా ప్రతిపక్ష పార్టీల నాయకులను అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. హామీలు అమలయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. అరెస్టు చేసిన వారిలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవిందర్‌రెడ్డి, మున్సిపల్ వార్డు కౌన్సిల్ ఎండి సలీం, అచల్‌రెడ్డి, ఎండి తచ, శ్రీనివాస్, కంసాన్‌పల్లి శ్రీనివాస్, తాయప్ప, రాజు,అరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టు చేసిన దృశ్యం

# డిసెంబర్ 8 లోగా ఓటర్ నమోదు పూర్తి చేయాలి

**-జిల్లా ఓటర్ జాబితా పరిశీలకులు, రాష్ట్ర రవాణా ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపాల్ స్పెషల్ సెక్రటరి విజయేంద్ర బోయి**

**వంగూరు, డిసెంబర్ 03, ప్రభాతవార్త:** జనవరి 2023 వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు డిసెంబర్ 8వ తేదీ లోగా ఓటర్ నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ఓటర్ జాబితా పరిశీలకులు, రాష్ట్ర రవాణా ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపాల్ స్పెషల్ సెక్రటరి విజయేంద్ర బోయి అన్నారు. శనివారం వంగూరు మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామంలోని 47వ పోలింగ్ కేంద్రంలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటంతో ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫాం7లో కుటుంబంలో ఎవరైన మృతి చెందితే వారి మరణ ధృవీకరణ పత్రాన్ని అందించి ఓటర్ జాబితా నుంచి తొలగించాలని సూచించారు. డిసెంబర్ 8వ తేదీ లోగా మీసేవా కేంద్రాల్లో లేదా బీఎల్‌ఓల వద్ద లేదా ఆన్‌లైన్‌లో ఓటర్ నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఫాం8 ఓటర్ కార్డులో మార్పులు, ఫోటో, ఇంటి పేరు, అడ్రస్‌లలో ఏవైనా మార్పులు చేయాలనుకుంటే చేసుకోవడానికి అవకాశం ఉందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండునాయక్, తహసీల్దార్ రాజునాయక్, ఉప తహసీల్దార్ భీష్మనాయక్, బీఎల్‌ఓ శ్రీను తదితరులు ఉన్నారు.


47వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర రవాణా ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపాల్ స్పెషల్ సెక్రటరి విజయేంద్ర బోయి

# వికలాంగుల సంక్షేమమే లక్ష్యం : ఎంఈఓ వెంకటయ్య

**గండీడ్,డిసెంబరు3ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో దివ్యాంగుల దినోత్సవం ఐఈఆర్ఈ సునిల్ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ వెంకటయ్య మాట్లాడుతూ అంగ వైకల్యంతో కుమిలిపోవాల్సిన అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులను అన్ని రకలుగా ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగులు ఆత్మనూన్యతా భావాన్ని పక్కన పెట్టి ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి సాధించలేనిది ఏమి లేదని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. అదేవిధంగా కొమిరెడ్డిపల్లి గ్రామంలో దివ్యాంగులకు బహుమతులు ఎంఈఓ చేతులమీదుగా అందజేశారు. గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హీరాలాల్ రాథోడ్ మాట్లాడుతూ దివ్యాంగులకు స్ఫూర్తివంతమైన ఉపదేశం, దివ్యాంగుల సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రంలోనే అగ్రభాగంలో ఉందన్నారు. దివ్యాంగులకు 3016 పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. దివ్యాంగులకు అవసరమైన వీల్‌ఛైర్స్, చేతికర్రలు, త్రీ వీలర్స్ స్కూటీలను అందజేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న దివ్యాంగుల సంక్షేమం అభివృద్ధి పథకాల వల్ల 2018,2019 సంవత్సరాలలో కేంద్రం దివ్యాంగుల సంక్షేమంలో తెలంగాణను అత్యుత్తమ రాష్ట్రంగా గుర్తించి అవార్డులు ఇచ్చిందన్నారు. వీటితో పాటు భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి ప్రభుత్వం ఈ ప్రణాళికలను సిద్ధం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్ఈ సునిల్, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు రామ్‌గోపాల్ నాయక్, ప్రైమరీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీశైలం, ఉపాధ్యాయులు నరేష్, రాములు, ధర్మనాయక్, సుధారాణి, విజయలక్ష్మి, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

# ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేసిన బహుజన నాయకులు

**మహ్మదాబాద్,డిసెంబరు 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నంచర్లగేట్ ఫంక్షన్ హాల్‌లో డిసెంబర్ 6వ తేదీన అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని ఆ సభకు ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి రావాలని ఆహ్వాన పత్రికను బహుజన నాయకులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి మాచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆల్ ఇండియా ఎస్సీ,ఎస్టీ ప్రొటెక్షన్ అధ్యక్షుడు రాములు, మహ్మదాబాద్ బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బిక్షపతి, పిఎసిఎస్ డైరెక్టర్ జంగాల వెంకట్, సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, వైస్ ఎంపిపి ఈశ్వరయ్యగౌడ్, గండీడ్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు పెంట్యానాయక్, పిఎసిఎస్ వైస్ ఛైర్మన్ గిరిముని, లక్ష్మీనారాయణ, జోగుకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

## దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

**కాంప్లెక్స్ హెచ్‌ఎం హనుమంతురెడ్డి**

**ఉప్పునుంతల,డిసెంబరు 3 ప్రభాతవార్త :** దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తూ అన్ని రంగాల్లో ముందుండాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం హనుమంతురెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం హనుమంతురెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులను చిన్నచూపు చూడకూడదని సమాజంలో అందరితో పాటు అన్ని రంగాల్లో రాణించాలని వారిపట్ల ఎవరు వివక్ష చూపకూడదని సూచించారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ, సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న సేవల గురించి వివరించారు. అదేవిధంగా భవిత విలీన విద్యా వనరుల కేంద్రం ద్వారా అందించే సేవలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు దివ్యాంగులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం హనుమంతురెడ్డితో పాటు ఐఈఆర్‌పిలు వెంకటయ్య, విజయ,ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, విష్ణువర్ధన్, ఆంజనేయులు, భార్గవి, ఎమ్మార్సీ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు ప్రధానం చేస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

## రాజోళిలో షాట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం రూ.50వేల నష్టం

**దేవరకద్ర,డిసెంబరు 03 ప్రభాతవార్త:** దేవరకద్ర ఉమ్మడి మండలంలోని కౌకుంట్ల మండల పరిధిలోని రాజోళిలో శనివారం ఓ ఇంట్లో షాట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైంది. భాదితుల కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి. రాజోళిలో పోతార్ల రామకృష్ణ అనే రైతు కుటుంబసభ్యులు ఇంటి ముందు పనిచేస్తుండగా ఇంట్లో ప్రమాదవశాత్తు షాట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మంటలను రామకృష్ణ కుటుంబసభ్యులు ప్రయత్నించినా లాభం లేకుండాపోయింది. అంతలోనే ఇంట్లో విక్రయించడానికి సిద్ధంగా ఉన్న దాదాపు 4 కింటాళ్ళ పత్తి కాలిపోయింది.అలాగే టీవీతో పాటు దుస్తులు,పరుపులు.పరుపులు. వంటసామగ్రి పూర్తిగా కాలిపోయాయి.దీనివల్ల దాదాపు రామకృష్ణ కుటుంబానికి దాదాపు రూ. 50వేలనష్టం వాటిల్లిందని గ్రామస్థులు తెలిపారు.భాదితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. విషయం తెలుసుకొన్న రెవేన్యూ అధికా రులు గ్రామానికి వచ్చి సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామ నిర్వహించినట్లు సర ్పంచ్ కృష్ణవే ణిరామకృష్ణ తెలిపారు. రాజోళిలో షాట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైన పోతార్ల రామకృష్ణ అనే రైతు కుటుంబసభ్యులను శనివారం ప్రముఖ సామాజికవేత్త కావలి పవన్‌కుమార్‌యాదవ్ సోదరుడు కావలి శేఖర్‌యాదవ్ పరామర్శించారు.


రాజోళిలో దగ్గమైన వస్తువుల వద్ద బాధితుడు పోతార్ల రామకృష్ణ కుటుంబసభ్యులు

## ముఖ్యమంత్రి సభకు అధికసంఖ్యలో తరలిరండి

**యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్**



**దేవరకద్ర,డిసెంబరు 03 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లో ఆదివారం జరిగే ముఖ్యమంత్రి సభను దేవరకద్ర మండలంలోని టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని మండల యంపీపీ కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్ కోరారు.దేవరకద్రలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా మండలంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ సభకు దేవరకద్ర మండలం నుండి పార్టీ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్ళి విజయవంతం చేద్దామన్నారు. సమావేశం అయిన తరువాత అందరూ కూడ క్షేమంగా తమతమ గమ్యస్థానాలకు వెళ్ళాని యంపీపీ సూచించారు.

## బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

**వంగూరు,డిసెంబర్03,ప్రభాతవార్త:**పాలమూరు జిల్లాలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హజరయ్యే కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పోలీసులతో బీజేపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేయించి కార్యక్రమాలు నిర్వహించడం ప్రజాస్వామ్యా అని వారు ప్రశ్నించారు. ఎన్నాళ్లీ రాచరిక పాలన కొనసాగుతుందని, తెలంగాణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి సభలు,సమావేశాలు ఏర్పాటు చేసుకోవడమేమిటని వారు ప్రశ్నించారు. ప్రజాస్వా మ్యంలో ఎవ్వరైన,ఎక్కడైన సభలు,సమావేశాలు నిర్వహించుకోవడానికి వీలుంది కానీ టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆ పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు మాత్రమే అనుమతులు ఉంటాయి కానీ మిగతా పార్టీలకు సంబంధించిన కార్యక్రమాలు చేపడితే అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యా అని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన వారిలో సైదులు, జగన్మోహన్‌రెడ్డి, అంజి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


అరెస్ట్ చేసిన బీజేపీ నాయకులు

## నిత్యాన్నదానానికి ఆర్థికసాయం

**అచ్చంపేట, డిసెంబర్ 03, ప్రభాతవార్త:**అచ్చంపేట నియోజకవర్గంలోని ఉమ మహేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానం చేసేందుకు రూ. 25, 116లు దేవరకొండ మున్సిపాలిటికి చెందిన బెజవాద నీరజ నరేందర్‌ల కుమార్తె పూజిత కుమారుడు సాయి స్వరూప్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతుల సమక్షంలో చైర్మన్ సుధాకర్‌కు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమమహేశ్వరస్వామి దేవస్థానం గతంలో కంటే ఇప్పుడు అభివృద్ధి చెందుతుందని, భక్తులకు అన్ని వసతులు, మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నారని, ఇలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రతి రోజు నిత్యాన్నదా నం, 500 నుంచి 1000మందికి చేపట్టడం శుభసూచికమని వారు పేర్కొన్నారు. నిత్యాన్నదానం లో భాగం పంచుకోవడానికే ఆర్థిక సహాయాన్ని అందించడ మైందని వారు అన్నారు. దేవాలయ దర్శనానికి కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడం విశేషమన్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసులు, అర్చకులు తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే గువ్వల దంపతుల సమక్షంలో చెక్కు అందజేస్తున్న దృశ్యం

## ఘనంగా ప్రపంచ వికాలాంగుల దినోత్సవం..

**వనపర్తి టౌన్,డిసెంబర్ 03 ప్రభాతవార్త:** అంతర్జాతీయ వికలాంగుల దినోత్స వం సందర్భంగా వనపర్తి జిల్లా వికాలాంగులకు అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారి కోరికలను మన్నించి వారికి న్యాయం చేయకుంటే అచలపక్ష ఐక్యవేదిక వారి వెంట ఉంటూ పోరాడుతుందని వారు చెప్పిన సమస్యలు న్యాయబద్ధంగా ఉన్నాయని వాటిలో ముఖ్యంగా వికలాంగ దళితులకు దళిత బంధు ఇవ్వాలలని, వికాలాంగులకు పని చేయడం చేతకాదని వారి మనోబలం పెంచే విధంగా పెన్షన్ ఇవ్వాలని, డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలని, పెన్షన్ కోత విషయంలో జీఓ నెంబర్ 17 న్యాయబద్ధంగా ఉండే విధంగా చూడాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. వారి సమస్యలపై త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి జిల్లా వికలాంగులను కలవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు శ్రీను, గంధం బాలయ్య, శ్రీనివాస్, అచలపక్ష ఐక్యవేదిక ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, జానంపేట రాములు పాల్గొన్నారు.


వికాలాంగులతో అచలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్

## విలేఖరి కుటుంబానికి వీజేఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం..

**అమరచింత,డిసెంబర్ 03 ప్రభాతవార్త:** అమరచింత మండలానికి చెందిన విలేఖరి ఖాజా హుస్సేన్ కు కాలేయం ఇన్ఫెక్షన్ పితాశయంలో రాలుండడం వల్ల గత మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు విషయం తెలుసుకున్న టీఆర్‌ఎస్ నేత వర్కటం జగన్నాథం రెడ్డి శనివారం బాదితుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని విజేఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రూ.10 ఆర్థికసాయం అందజేశారు.


ఖాజా హుస్సేన్ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న వీజేఆర్ ఫౌండేషన్ సభ్యులు

## అర్హులందరికి అవకాశం కల్పించాలి

**తహసిల్దార్ శైలేంద్రకుమార్**

**ఉప్పునుంతల,డిసెంబరు3 ప్రభాతవార్త:** వయోజనులైన యువతీ, యువకులు ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా బూత్‌లెవల్ అధికారులు అవగాహన కల్పించాలని తహసిల్దార్ శైలేంద్రకుమార్ సూచించారు.శనివారం మండల కేంద్రమైన ఉప్పునుంతల, కంసాన్‌పల్లి గ్రామాలలో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసిల్దార్ పరిశీలించారు. ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఆయనతో పాటు ఉపతహసిల్దార్ సరస్వతి, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.



## ప్రతిరైతు ఈకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి

**ఉప్పునుంతల,డిసెంబరు3 ప్రభాతవార్త:** భూమికలిగిన ప్రతి రైతు పీఎం కిసాన్ కింద ఈకెవైసిచేయించుకోవాలని మండల విస్తీర్ణాధికారి రవి రైతులకు అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని మొల్గర గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు అధ్యక్షతన గ్రామ సచివాలయంలో రైతులకు అవగాహనసదస్సు నిర్వహించారు.పీఎం కిసాన్‌కింద లబ్దిపొందిన రైతులు బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ఆధార్ నంబర్‌కు లింక్ ఉన్న ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేయించుకోవాలని అలా చేసుకోని రైతులకు పీఎం కిసాన్‌కింద సంవత్సరానికి వచ్చే రూ.6వేలు బ్యాంకులో జమ కావని అవగాహన కల్పించారు.సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు ఉపసర్పంచ్ పవన్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి గ్రామ కమిటి అధ్యక్షుడు సుమన్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



## శ్రీకాంతచారికి ఘనంగా నివాళులు

**ఉప్పునుంతల,డిసెంబరు3 ప్రభాతవార్త:** మలిదశ ఉద్యమకా రుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల పోచమ్మ చౌరస్తాలో శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.2003సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర సాధనకై అమరుడైన శ్రీకాంతాచారి 13వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరు పుకున్నారు. కార్యక్రమంలో అచ్చంపేట పాల శీతలీకరణ ఛైర్మన్ కట్ట గోపాల్‌రెడ్డి, టిఆర్‌ఎస్ గ్రామ కమిటి అధ్యక్షుడు మేడమోని శ్రీనివాసులు, గున్నమోని ఎల్లయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ వసురాంనాయక్, పాత్కుల రాంచంద్రయ్య, మల్లయ్య, బయ్యశ్రీను, శ్రీకాంత్, శ్రీను, పరశురాములు, లింగమయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.



## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**దేవరకద్ర,డిసెంబరు 03 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం 273 కింటాళ్ళ సోనాధాన్యాన్ని రైతులు విక్రయానికితీసుకవచ్చారు. అయితే కింటాల్ సోన ధాన్యానికి అత్యధికంగా రూ.2372 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.1809 ధర పలికింది. అలాగే 12 కింటాళ్ళ హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ హంస ధాన్యానికి అత్యధికంగా రూ.1901 ధర పలికింది. అతి తక్కువగా రూ.1801 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్‌నాయకుల అరెస్ట్ పిరికిపంద చర్య

**టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి**



**దేవరకద్ర,డిసెంబరు 03 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి పాలమూరు పర్యటన సందర్భంగా శనివారం ఆయా ప్రాంతాలలో కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం పిరికిపంద చర్య అని దేవరకద్రకు చెందిన టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఇది చేతగాని చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రజాప్రతినిధులు ప్రజలలోకి రావడానికి ఎందుకు అంతగా భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రశించే గొంతుకలను నొక్కడం సబబు కాదన్నారు.

## సీఎం సమావేశాన్ని విజయవంతం చేద్దాం:ఐకెపి పీఎం సునిత

**కోయిల్‌కొండ,డిసెంబరు 3 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించే రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ సమావేశాన్ని విజయవంతం చేద్దామని ఐకెపి ఎపిఎం సునిత మహిళా సంఘాలకు సూచించారు. శనివారం మండలంలోని పారుపల్లి గ్రామంలో గ్రామాల మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై సీఎం సభ వివరాలను వివరించారు. మండలంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలలోని మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో సీఎం సభకు తరలివెళ్లి విజయవంతం చేయాలని ఐకెపి ఎపిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సీసీ కేశవులు తదితరులు పాల్గొన్నారు.



# అమరుడా అందుకో.. మా జోహార్లు

## •ఘనంగా తెలంగాణ మలిదశ ఉద్యమవీరుడు శ్రీకాంతాచారి వర్ధంతి వేడుకలు



**అచ్చంపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసి ఊవ్వెత్తున ఎసిగిపడెలా తెలంగాణ నినాదాన్ని వాడ వాడన వినిపించేందుకు తాను ఆత్మబలిదానం చేసుకొని తెలంగాణ ప్రజల, విద్యార్థుల్లో ఆక్రోశాన్ని నింపిన తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారికి ఐన్‌టీయూసీ తాలూకా అధ్యక్షులు మహబూబ్‌అలీ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను నిర్వ హించారు. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మహబూబ్‌అలీ మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్ర సాధన కోసం అమరుడైన శ్రీకాంతాచారి తల్లికి కనీసం ఎమ్మెల్సీ కూడా ఇవ్వలేదని, ఆ కుటుంబానికి కనీస గౌరవం కూడా దక్కే విధంగా నేటి తెలంగాణ ప్రభుత్వం చూడలేదని, అవసరాలను బట్టి వాడుకునేందుకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు అనాడు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఇచ్చారే తప్ప గెలిపించి ఉద్యమ అమరుడి కుటుంబానికి న్యాయం చేయడానికి కాదని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో టీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడానికి యావత్ తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నార న్నారు. అమరుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అమరుల కుటుం బాలను గాలికి వదిలేసి కేసీఆర్ కుటుంబంలో మాత్రం అన్ని ఉద్యో గాలు కల్పించి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలుగా చేసిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభు త్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శేఖర్, ప్రధాన కార్యదర్శి అంజి, ఉపాధ్యక్షులు వీరేశం, ప్రధాన కార్యదర్శి హామీద్, ఉపాధ్య క్షులు రాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు అంజి, బీసీ సెల్ అచ్చంపేట అధ్యక్షులు పర్వతాలుగౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ముత్యాలు, నాయకులు అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

**కల్వకుర్తి, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** మలిదశ ఉద్యమకారుడు, తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద శ్రీకాంతాచారి చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్‌లు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ శ్రీకాంతాచారి మరణం వృధా కాలేదని, ఆయన ఏ ఉద్దేశ్యంతో అయితే బలిదానం చేసుకున్నారో నేడు తెలంగాణ ప్రజలు ఆ ఫలాలను అనుభవిస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రతి ఏటా శ్రీకాంతాచారి వర్ధంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు. శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు ప్రభుత్వం నామినేటెడ్ పదవులు కల్పించి శ్రీకాంతాచారి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సైదులుగౌడ్, బీసీ సబ్ ప్లాన్ తాలూకా అధ్యక్షులు రమేష్‌చారి, ప్రధాన కార్యదర్శి గోపాల్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మధు, నాయకులు కృష్ణ, దయాకర్‌చారి, విశ్వకర్మ సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

**నారాయణపేట, డిసెంబరు 3 ప్రభాతవార్త:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని మక్తల్‌లోని మోనేశ్వర దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. నీళ్లు, నిధులు, నియామకాల కొరకు జరిగిన ఉద్యమంలో తెలంగాణ ప్రజలందరు పాల్గొని సాధించుకున్న తెలంగాణ అని వక్తలుఅన్నారు. కార్యక్రమంలోవిశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘంమక్తల్ అధ్యక్షులు బ్రహ్మయ్య ఆచారి, టిజెఎసి సూర్యప్రకాష్, చిన్నకృష్ణయ్య ఆచారి, భగవంతాచారి, సురేంద్రాచారి, సత్యనారాయణచారి, పూజారి బ్రహ్మనందం ఆచారి, పూజారి విష్ణుమూర్తి ఆచారి, మద్వార్ వెంకటేష్ ఆచారి, సంగంబండ బాలరాజుఆచారి, వీరన్నచారి, అనుగొండ నరేష్‌చారి పాల్గొన్నారు.

**కోయిల్‌కొండ, డిసెంబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్రసాధన కోసం తన జీవితాన్ని త్యాగంచేసి చరిత్రలో నిలిచిన వ్యక్తి శ్రీకాంతాచారి అని గ్రామ సర్పంచ్ బి. కృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉద్యమానికి ఊపిరి పోసి తన దేహాన్ని అగ్నికి ధారబోసిన మలిదశ విద్యార్థి అమరుడు శ్రీకాంతాచారి అన్నారు. స్వరాష్ట్రం కోసం ఆయన చేసిన పోరాటాలను తెలంగాణ ప్రజలు ఎప్పటికి మరువలేరన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఆంజనేయులు, గ్రామ ఉపసర్పంచ్ ఖాజానవాజ్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాజా, యువజన సంఘం అధ్యక్షులు లక్కిగౌడ్, వార్డు సభ్యులు ఆంజనేయులు, నరేష్, కళాశాలప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు

**వనపర్తి టౌన్, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు కార్యాలయంలో మలిదశ తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తూ శ్రీకాంతా చారిని స్మరిస్తూ 13వ వర్ధంతిని జోహార్ జోహార్ అంటూ ఆయనను స్మరించు కున్నారు. వాల్మీకి సంఘం ఉమ్మడి కన్వీ నర్, మలిదశ ఉద్యమకారుడు మండ్ల దేవన్న నాయుడు, వాల్మీకి సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుసిరెడ్డి స్వా మి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని తట్టిలేపి శ్రీకాంతాచారి ఆత్మార్పారణతో ఉద్యమాన్ని తారా స్థాయికి చేర్చిన వీరుడు శ్రీకాంతాచారి అని అన్నారు. ఒకవేళ నా ఆత్మా ర్పణతో తెలంగాణ రాకపోతే మళ్లీ నాజన్మ ఎత్తి తెలంగాణ కోసం ప్రాణాలు ఇస్తానని నినదించిన వీరుడు శ్రీకాంతాచారి 5రోజులు మృత్యువుతో పోరాడి డిసెంబర్ 3వ తేదీ 2009 రోజున అమరుడయ్యాడు ఉద్యమ పోరాట యోధుడు, ఉద్యమ స్ఫూర్తిని శ్రీకాంతాచారి ఇచ్చాడని ఆయన చేసిన త్యాగాన్ని కొనిడాయారు.

**ఖిల్లాఘణపురం, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోశనివారం సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన తెలంగాణ వీరుడు శ్రీకాంతాచారి వర్ధంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో అలంకరించి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమానికిముఖ్య అతిథిగా జడ్పీటీసీ సామ్యా నాయక్ హాజరై మాట్లాడుతూ శ్రీకాంతాచారి విద్యార్థి దశలోనే తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొనేవాడని 2009 నవంబర్ 29న హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చౌరస్తాలో కేసీఆర్ అరెస్టుకు నిరసనగా జరిగిన ధర్నాలో ఒంటిమీద పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఉద్యమ జ్వాలను రగిల్చి అగ్నికి ఆహుతి అవుతూ జై తెలంగాణ అంటూ నినాదించాడని గుర్తు చేశారు. 5రోజుల పాటు మృత్యువుతో పోరాడుతూ కూడా తెలంగాణ నామ స్మరణ చేసిన ఉద్మకారుడు శ్రీకాంతాచారి అని కొనియాడారు. బతికితే తెలంగాణ కోసం మళ్లీ చావడానికైనా సిద్దమన్నాడనిఆ స్ఫూర్తితో తెలంగాణలోని ప్రతి బిడ్డ ఉద్యమంలో పిడికిలి బిగించి ఆంధ్ర పెత్తందారులను గడగడలాడించారని అన్నారు. తెలంగాణ బిడ్డ ఎగిసే మంటల్లో బూడిదవుతుంటే టీవీల్లో చూసిన నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల గుండెలు పగిలిపోయాయయని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఉద్యమానికి ఉద్యుక్తులయ్యేలా ఉద్యమజ్వాల రగిలించాడని ప్రత్యేక రాష్ట్రం ప్రాణత్యాగం చేసి అమరుడైన శ్రీకాంతాచారి తెలంగాణ ప్రజలందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని తెలిపారు. వీరుడా నీ త్యాగం వృధా కాలేదు నిన్ను మరువదు ఈ తెలంగాణ నీకు ఇదే వందనం జోహార్ శ్రీకాంతాచారి అంటూ సేవలు తెలంగాణ గడ్డపై నిలిచిపోతాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య గౌడ్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దాసరలన భూమయ్య, టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పెద్ద ఆంజనేయులు గౌడ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలి



బాలికల పాఠశాలలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**అమరచింత, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్ల శుభ్రం చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణ విద్యాధికారులు వివిధ పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాఘవ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ఉన్నత బాలికల పాఠశాల లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల పాఠశాలలో విద్యార్థులకు బెంచీలు లేక నేలపై కూర్చుంటున్నారని ఆయన తెలిపారు. అలాగే బాలికల పాఠశాలలో పీఈటీ లేకపోవడం వల్ల విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారని తక్షణమే బాలికల పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుని నియమించాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు అవినాష్, అక్బర్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత



**అమరచింత, డిసెంబర్3 ప్రభాతవార్త:** దివ్యాంగులు అధైర్యకపడకుండా పట్టుదలతో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అమరచింత మండల తహసిల్దార్ షేక్‌చాంద్‌బాష దివ్యాంగ విద్యార్థులను కోరారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని డీఎమ్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా తమసిల్దార్ మాట్లాడుతూ జిల్లాలో డీఎమ్ఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత ఆధ్వర్యంలో 22మంది విద్యార్థులకు ఆట, పాట చదువుతో పాటునేర్పించి విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమని ఆయన అన్నారు. అలాగే విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ సింగ్, డీఎంఆర్ పాఠశాల హెచ్ఎమ్ బాలస్వామి, రెడ్‌క్రాస్‌యూత్ జిల్లాకన్వీనర్ కలాంపాష, స్వప్న, పాల్గొన్నారు.

## విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన సదస్సు

**వనపర్తి టౌన్, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సురేష్ కుమార్ అధ్యక్షత వహించగా. ముఖ్య అతిథిగా భారత నాస్తిక సమాజం-మూఢనమ్మకాల నిర్మూలన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొల్లి ఆదం రాజు, కవిజ్వాల, శంకర్ గౌడ్, గాయకులు మల్లెపు నరసింహ, విచ్చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదం తన మ్యూజిక్ ద్వారా కళాశాల విద్యార్థులకు అవగాహన కలిగించే ప్రయత్నం చేశారు. బాబాలు చేసేటువంటి మాయలు, మంత్రాలు నమ్మకూడదని మూఢనమ్మకాలకుపోయి శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డా.ఎ.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పోతురాజు శ్రీనివాస్, సత్యమ్మ, మంజుల మన్యం, గోవర్ధన్, స్రవంతి విజయలక్ష్మీ, అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



## తప్పులేని ఓటర్ జాబితా తయారు చేయాలి

### - జిల్లా ఓటర్ జాబితా పరిశీలకులు, రాష్ట్ర రవాణా ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపాల్ స్పెషల్ సెక్రటరి విజయేంద్ర బోయి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఓటర్ జాబితా పరిశీలకులు, రాష్ట్ర రవాణా ఆర్అండ్‌బీ ప్రిన్సిపాల్ స్పెషల్ సెక్రటరి విజయేంద్ర బోయి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను రూపొందించడంలో రాజకీయ పక్షాల సహకారం ఎంతో అవసరమనిజిల్లా ఓటర్ జాబితా పరిశీలకులు, రాష్ట్ర రవాణా ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపాల్ స్పెషల్ సెక్రటరి విజయేంద్ర బోయి అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఓటర జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ ప్రతి సంవత్సరం జరిగే ప్రక్రియ అయినప్పటికి ఎలాంటి తప్పులు లేకుండా ఓటర జాబితాను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా జనవరి 01,2023 నాటికి 18 సంవత్సరాలు పూర్తైన యువతీ, యువకులను తప్పనిసరిగా ఓటర్ జాబితాలోకి తీసుకొని రావాలని, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం, మార్పులు, చేర్పుల వం టి విషయాల్లో రాజకీయ పార్టీల పాత్ర ముఖ్యమని ఆమె తెలిపారు. డిసెం బర్ 8 వరకు క్లెయిమ్స్ స్వీకరణ ఉంటుందని, జనవరి 5న తుది ఓటర్ జాబితాను ప్రచురిస్తారని ఆమె తెలిపారు. ఇందులో భాగంగానే ఈ నెల 3,4వ తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల్లోనే ఉంటారని, అక్కడ క్లెయిమ్స్ సమర్పించ వచ్చునని ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధి భాస్కర్‌గౌడ్, హామీద్, కాంగ్రెస్‌పార్టీ ప్రతినిధి అహ్మెద్‌పాష, సీపీఎం సత్యం, వైఎస్ఆర్సీపీ ఎండీ.హుస్సైన్, బీజేపీ వెల్దండ యుగేందర్‌రావు, బీఎస్పీ కే.రామకృష్ణ, టీడీపీ బాలకృష్ణ, అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీఓలు నాగలక్ష్మి, హనుమాన్ నాయక్, పాండునాయక్, తహసీల్దార్లు జైకృష్ణ, రమేష్, భాస్కర్, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సిబ్బంది అశోక్, కరుణాకర్ ఉన్నారు.

## దివ్యాంగుల్లో సామార్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలి



దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి యుగేంధర్

**ఖిల్లాఘణపురం, డిసెంబర్3 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూఎస్ఎన్ జిల్లా అధికారి యుగేంధర్, మండల విద్యాశాఖాధికారి ఉషారాణి మాట్లాడుతూ దివ్యాంగు పిల్లల్లో ఉన్న సామార్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించడంతో వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసి ఉన్నతంగా ఎదగడానికి తల్లిదండ్రులు కృషి చేయాలని అన్నారు. దివ్యాంగుల విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు అశ్రద్ధ వహించరాదని అన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల ఆత్మ స్థైర్యాన్ని పెంచేలా తల్లిదండ్రులు ప్రవర్తించాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల విద్యార్థులకు సతుపాయాలు కల్పించి పరికరాలను అందించి క్యాంపులను నిర్వహిస్తుందని తెలిపారు. దివ్యాంగ విద్యార్థులకు సదరం సర్టిఫికేట్లు, స్కాలర్‌షిప్ అవసరమైన వారు ఐఈడీ కోఆర్డినేటర్ ను సంప్రదించాలని అన్నారు. విద్యార్థుల్లో ఉన్న అవిటితనాన్ని కాకుండా వాళ్లలో ఉన్న ప్రతిభ సామర్థ్యలను గుర్తించాలని ఆకాంక్షించారు. దివ్యాంగ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని వారి ప్రతిభ ఆధారంగా ఉన్నత రంగాల వైపు తీసుకెళ్లాలని అన్నారు. దివ్యాంగులు అనుకుంటే ఏదైనా సాధించగలరని ఉదాహరణతో తెలిపారు. యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల విద్యార్థులకు తల్లి దండ్రులకు పౌష్టికాహారాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూఎస్ఎన్ఎస్ఓ తిరుపతిరెడ్డి, ఐడీ కోఆర్డినేటర్‌రజిత, యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు మధు, సామాజిక కార్యకర్తకమ్మరి గోపి, ఎంఆర్సీ సిబ్బంది, తిరుపతయ్య, రాములు, వెంకటేష్, పార్వతమ్మ, పవన్ తదితరులుపాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువైనది

### •కొత్తగా 53 ఓటుహక్కు నమోదుకు దరఖాస్తులు: తహసీల్దార్ సుబ్రహ్మణ్యం



**ఇటిక్యాల, డిసెంబరు 3 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ఎన్నికల్లో నచ్చిన వ్యక్తిని ఎన్నుకొనేందుకు ఓటుహక్కు ఎంతో విలువైనదని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటుహక్కు నమోదు కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసిల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎన్నికల కమిషన్ జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు ఈనెల 3,4వ తేదీలలో మండల పరిధిలోని 49వ పోలింగ్ స్టేషన్లలో ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు శనివారం తహసిల్దార్ సుబ్రహ్మణ్యం కొండేరు, యాక్తాపురం, ఎర్రవల్లి, కొండపేట గ్రామాలలో కొనసాగిన ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మొదటిరోజు ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో మండల పరిధిలోని 49వ పోలింగ్ స్టేషన్‌లో కొత్తగా 53 దరఖాస్తులు వచ్చినట్లు అదేవిధంగా ఓటరు లిస్టులో పేర్లు ఉండి చనిపోయిన వారిని తొలగించేందుకు 78 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్ తిమ్మాపురం, జింకలపల్లి తదితర గ్రామాలలో పర్యటించి ఓటరు నమోదుప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అలాగే ఆర్ఐ సుదర్శన్‌రెడ్డి ఇటిక్యాల, చాగాపురం, బుడ్డారెడ్డిపల్లి గ్రామాలలోని ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అజిత్, బిఎల్‌ఓలుగా విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడి టీచర్లు, పంచాయతీ రాజ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మాలల సమరభేరి బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలి



కల్వకుర్తి డివిజన్ ఉపాధ్యక్షులు గణేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, డిసెంబర్3, ప్రభాతవార్త:** తెలంగాణ మాల మహానాడు మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శిగా కానుక భారతిని రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం తెలంగాణ మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 18న వరంగల్ జిల్లాలో నిర్వహించే మాలల సమరభేరి బహిరంగసభకు ఉమ్మడి జిల్లాల నుంచిమాలలు వేలాదిగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. పూలే, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించి జాతి అభివృద్ధి, హక్కులసాధన కోసం నిరంతరం పోరాడుతూనే ఉండాలన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా భారతి, కల్వకుర్తి డివిజన్ ఉపాధ్యక్షులుగా గణేష్, కల్వకుర్తి పట్టణ అధ్యక్షులుగా నాగరాజులను నియమించారు. కార్యక్రమంలోపాలమూరు జిల్లా కోశాధికారి ఆంజనేయులు, మహిళా అధ్యక్షురాలు నిర్మల, జనరల్ సెక్రటరి అలివేలు మంగ, ప్రచార కార్యదర్శులు పావని తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీని సన్మానించిన టీఆర్‌ఎస్ నేతలు



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, డిసెంబర్3, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండల పరిధిలోని అజిలాపూర్ గేటు నుంచి భైరాపూర్ గ్రామం వరకు బీటీ రోడ్డు లేకపోవడం వల్ల ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి విన్నవించడంతో ప్రజల కోరిక మేరకు స్పందించారు. అజిలాపూర్ టూ భైరాపూర్ వరకు బీటీ రోడ్డు మంజూరు చేయించడంతో టీఆర్‌ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తుందనిఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, వార్డు సభ్యులు వెంకటేష్, జగన్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కృష్ణయ్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, డిసెంబర్3, ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పబ్బతి కృష్ణయ్య గత కొద్ది కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పబ్బతి కృష్ణయ్యను పరామర్శించి చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పిండి సత్యనారాయణరెడ్డి, మంద అల్వాల్‌రెడ్డి, బండపల్లి పరమేశ్వర్, బన్నె మల్లయ్య, బాల జంగయ్య, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీపతి రాజు, ఆవ గణేష్, హసన్, షఫీ తదితరులు ఉన్నారు.

## గురుస్వామికి ఘన సన్మానం



శ్రావణ్ గురుస్వామిని సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ ఛైర్మన్‌వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండలం తాడిపర్తి గ్రామానికి చెందిన శ్రావణ్ గురుస్వామి 18వ పడి నారీకేళ గురుస్వామి అయిన సందర్భంగా 18వ సారి శబరి యాత్ర చేస్తున్న శ్రావణ్ గురుస్వామిని వనపర్తి మున్సిపల్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, ముత్తు కృష్ణ గురుస్వామి శిష్య బృందం ఘనంగా సన్మానించారు. అయ్యప్ప స్వాములు వందలాది మంది తాడిపర్తిలో జరిగిన అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమంలో పాల్గొని అత్యంత భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి అంగపూజ, అభిషేకం, అష్టోత్తరం బ్రహ్మోపదేశం భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ ముత్తు కృష్ణ గురుస్వామి, ప్రధాన శిష్యుడైనటువంటి శ్రవణ్ గురుస్వామి 18వ సారి యాత్ర చేయడం గొప్ప విషయమని గోపాల్‌పేట మండలంలో ఆధ్యాత్మికతను పెంపొందించడంలో ఆయన పాత్ర ఎంతో ఉందని అయ్యప్పలను మాలవేసిన ఘనత శ్రావణ్ గురుస్వామి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాగితాలలక్ష్మీనారాయణ, గురుస్వామి బాల్‌రెడ్డి గురుస్వామి పోతులరాము, బీచుపల్లి యాదవ్, గురుస్వాములు, బాల్‌రెడ్డి, ఈశ్వర్, నందిమల్ల అశోక్, రామకృష్ణ, అంకూర్ విష్ణువర్దన్ రెడ్డి, నక్క రాములు, ప్రకాష్, కళ్యాణ్, శివ గురుస్వాములు పాల్గొన్నారు.

## జీవన నైపుణ్యాల శిక్షణ తరగతులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్3, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కేజీబీవీ టీచర్లకు రెండు రోజుల జీవన నైపుణ్యాల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ ట్రైనింగ్‌లో ఫోక్సో యాక్ట్ గురించి రుతుస్రావం పరిశుభ్రత, ఉమెన్ ట్రాఫికింగ్ మొదలుగా విషయాల గురించి చర్చించారు. నిత్య జీవితంలో సమాజంలోని వివిధ పరిస్థితులను ఎదుర్కోవడానికి అవసరమైనటువంటి జీవన నైపుణ్యాలను చర్చించారు. నేటి బాల బాలికల్లో చాల మందికి భావ వ్యక్తీకరణ సామర్థ్యం పెంచాలి, సమాజంలో చోటు చేసుకుంటున్న అంశాలపై అవగాహన కల్పించాలి, దీనికి తోడు సురక్షితం కానీ అంతర్జాల వినియోగంతో బాల బాలికలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయి కావునా విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు రూమ్ టూ రీడ్ ఇండియా ట్రస్ట్ ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, రూమ్ టూ రీడ్ ప్రతినిధులు సరిత, సుధా, వెంకటలక్ష్మి, ఉదయ్ తదితరులు ఉన్నారు.



# ప్రయాణీకులకనుగుణంగా బస్సులు నడపాలి

**● కల్వకుర్తి డిపో బస్సు ఎదుట ప్రయాణీకుల నిరసన**

**ఉప్పునుంతల,డిసెంబరు 3 ప్రభాతవార్త:** కల్వకుర్తి ఆర్టీసి డిపోకు చెందిన ఆర్టీసి బస్సు వేళలను ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ ప్రయాణీకులను అయోమయానికి గురి చేస్తున్నారని ఆరోపిస్తూ శనివారం ఉప్పునుంతల మండలం కంసాన్‌పల్లిలో ప్రయాణీకులు బస్సు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కల్వకుర్తి ఆర్టీసి డిపోకు చెందిన ఆర్టీసి బస్సు చింతపల్లి, అచ్చంపేటకు నడపిస్తున్నారని, ప్రయాణీకుల సమయాల కనుగుణంగా కాకుండా ఇష్టానుసారంగా నడిపిస్తున్నారని ఆరోపించారు.నవంబర్ 29 నుండిబస్సు వేళలను మార్చాలని, అచ్చంపేట డిపోకు చెందిన బస్సు సమయాలకు దగ్గంగా మార్చడంతో ఇబ్బందులు తలెత్తాయన్నారు. రెండు బస్సులు వెనుకవెనక వెళ్లడం వల్ల ప్రయాణీకులకు గందరగోళం ఏర్పడిందన్నారు. రెండు నెలల వ్యవధిలోనే చాలాసార్లు బస్సు వేళలను మార్చారన్నారు. బస్సు వేళలు మార్చినా ప్రయాణీకులకు ఎలాంటి



కల్వకుర్తి డిపోకు చెందిన బస్సును అడ్డుకున్న కంసాన్‌పల్లి గ్రామస్తులు

సమాచారం ఇవ్వడం లేదని, బస్సు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని కంసాన్‌పల్లి, తిర్మలాపూర్,ఉప్పునుంతల, చింతపల్లి, గట్టుకాడిపల్లి ప్రయాణీకులు అన్నారు. గతంలో కల్వకుర్తిలో మధ్యాహ్నం 1 గం.ల తర్వాత బస్సు ను రద్దుచేసి ఉదయం 11 గం.ల సమయంలో అచ్చంపేటకు చెందిన బస్సు గత రెండు నెలల నుండి నడవడంతో సమస్య ఏర్పడిందన్నారు. మధ్యాహ్నా వేళలో కల్వకుర్తి నుండి అచ్చంపేటకు బస్సు ను పునరుద్ధరించాలని కోరారు. నైట్‌హాల్ట్ బస్సులకు మహిళా కండక్టర్లకు డ్యూటీలు వేయవద్దని నిబంధన ఉన్నా చింతపల్లి బస్సుకు మహిళా కండక్టర్లకు డ్యూటీలు వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కల్వకుర్తి డీఎం శ్రీకాంత్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు కంసాన్‌పల్లి సర్పంచ్ లక్ష్మినారాయణ, తిర్మలాపూర్‌కు చెందిన శేఖర్, నందనాచారి, పలు గ్రామాలకు చెందిన వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రయాణీకులు రామకృష్ణ, ఆర్ట్ శ్రీను, బాల్‌రాజు, వెంకటయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యత

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 3 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా పాటించినప్పుడే భావితరాల వారికి మంచి గాలి, నీరు, మట్టి లభిస్తుందని హైకోర్టు న్యాయమూర్తి విజయసేనారెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని జడ్పీ సమావేశ మందిరంలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. మానవ మనుగడ సాధించాలంటే ప్లాస్టిక్‌ను తరిమేయాలని అన్నారు. ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధం చేసిన ప్రతి ఒక్కరిలో మార్పురావాలని స్వతహాగా ప్లాస్టిక్ నిరోధించి కాగితపు సంచులు, బట్టసంచులు వాడేలా అవగాహన కల్పించాలన్నారు. భవిష్యత్తు తరాల వారికి మనం ఆస్తులు ఇచ్చినట్లే మంచి గాలి, నీరు, మట్టి అందజేయాలని అన్నారు. అడవులను వదిలి పులులు గ్రామాల మీదకు ఎందుకు వస్తున్నాయి, అడవులు అంతరించడం వల్లే పులులు గ్రామాలకు వస్తున్నాయని అన్నారు. పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ లక్ష్మికాంత్ రాథోడ్ మాట్లాడుతూ నానాటికి పర్యావరణ తగ్గిపోతున్నదని ప్రతి ఒక్కరు పర్యావరణ కాపాడిన నాడే మనకు మంచి గాలి, నీరు, మట్టి లభిస్తుందని అన్నారు. జడ్పీ ఛైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని బట్టసంచులు వాడితేనే పర్యావరణానికి హాని జరగదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ప్రేమావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంతరెడ్డి, న్యాయవాది మల్లారెడ్డి, రాజేశ్వర్, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు టీషర్టుల పంపిణీ

**గండీడ్,డిసెంబరు 3 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెన్నచెడ్ గ్రామ సమీపంలో గ్రౌండ్‌లో ఎస్సై, కానిస్టేబుల్ అర్హత సాధించి శారీరక ధారుఢ్యం పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు డిసిసిబి ఛైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి ఏకరూప టీషర్టులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉద్యోగాలు సాధించేందుకు బాగా కష్టపడాలన్నారు. అభ్యర్థులకు ఏ విధమైన సాయం కావాలన్నా తాము కృషి చేస్తామని ఛైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో దోమ బలవర్ధన్‌రెడ్డి, పొగాకు మహేందర్, ఎండి ఇజాజ్‌పాషా, బిఎంఆర్ సభ్యులు పాల్గొన్నారు.

## అర్హులందరు ఓటర్ నమోదును సద్వినియోగం చేసుకోవాలి

**వెల్దండ,డిసెంబర్ 3, ప్రభాతవార్త:** మండలంలో చేపడుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాం7లో కుటుంబంలో ఎవరైన మృతి చెందితే వారి మరణ ధృవీకరణ పత్రాన్ని అందించి ఓటర్ జాబితా నుంచి తొలగించాలని సూచించారు. డిసెంబర్ 8వ తేదీ లోగా మీసేవా కేంద్రాల్లో లేదా బీఎల్‌ఓల వద్ద లేదా ఆన్‌లైన్‌లో ఓటర్ నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫాం8 ఓటర్ కార్డులో మార్పులు, ఫోటో, ఇంటి పేరు, అడ్రస్‌లలో ఏవైనా మార్పులు చేయాలనుకుంటే చేసుకోవడానికి అవకాశం ఉందని ఆయన తెలిపారు.

## సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థి ప్రతిభ

**వెల్దండ,డిసెంబర్3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాచూర్ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎ.శివ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో తయారు చేసిన ఎగ్జిబిషన్ జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. విద్యార్థి శివను ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు కూన శ్రీనివాసులు, టీ.వెంకటారెడ్డిలు శాలువాలతో సన్మానించి అభినందించారు. రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా రాణించాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటేష్, రమేష్, ఉపాధ్యాయులు జంగయ్య, ఆనంద్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి,శ్రీనివాసులు, రాజ్యలక్ష్మి, రుబియాబేగం, సత్యనారాయణతో పాటు తదితరులు ఉన్నారు.

## నీటి మట్టం కొలిచే పరిశీలక బోరు బావి ప్రారంభం

**వెల్దండ,డిసెంబర్3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని భైరాపూర్ గ్రామంలో శనివారం భూగర్భజలాల జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టును ఎంపీపీ విజయజైపాల్‌నాయక్, గ్రామ సర్పంచ్ దార్లకుమార్‌లతో కలిసి భూగర్భ జల అధికారి రమాదేవి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూగర్భ జల మట్టముల సేకరణ మరియు లెక్కింపు పరిధిని విస్తృతం చేయుటకు భూగర్భ జల శాఖ ద్వారా నూతనంగా 30 పిజోమీటర్లను నిర్మించి అందులో డిజిటల్ వాటర్ లెవల్ రికార్డర్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. నూతన సాంకేతిక విధానం ద్వారా ఖచ్చితమైన భూగర్భ జల నీటి మట్టము ప్రతి ఆరు గంటలకొకసారి నమోదు చేయబడుతాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జియాలిజిస్ట్ లింగస్వామి, జియోఫిజిసిస్ట్ మాథ్యూస్, మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్, ఎంపీడీఓ మోహన్‌లాల్, ఎంపీఓ సునిత, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, ఉప సర్పంచ్ రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## నూతన కలెక్టరేట్ భవనాన్ని పరిశీలించిన రాష్ట్ర ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపాల్ స్పెషల్ సెక్రటరి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చివరి దశ నిర్మాణ పనులు కొనసాగుతున్న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని రాష్ట్ర ఆర్అండ్ బీ ప్రిన్సిపాల్ స్పెషల్ సెక్రటరి విజయేంద్ర బోయి పరిశీలించారు. కార్యాలయ నిర్మాణ పనులను ప్రిన్సిపాల్ స్పెషల్ సెక్రటరి విజయేంద్ర బోయి అధికారులతో అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ కార్యాలయం చుట్టు మొత్తం మొక్కలు ఉండేలా చూడాలని, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా తనిఖీలు నిర్వహించాలన్నారు. సమీకృత భవన ప్రారంభోత్సవానికి పూర్తి స్థాయిలో సంసిద్ధం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. సమావేశ మందిరం, వివిధ కార్యాలయ గదులను ఆమె పరిశీలించారు.ఆమె వెంట అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీఓ నాగలక్ష్మి, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నారు.

## కంటి వెలుగు ప్రోగ్రాం-2 ఆప్తాల్మిక్ పోస్టుల కొరకు దరఖాస్తుల స్వీకరణ

**వనపర్తి టౌన్,డిసెంబర్ 3 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంటి వెలుగు ప్రోగ్రాం-2 సందర్భంగా పారామెడికల్ లో ఆప్తాల్మిక్ ఆఫీసర్ పోస్టుల రిక్రూట్‌మెంట్ కొరకు వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేదీ 5/10/2022 రోజున ఉదయం 10గంటలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయం నందు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాక అధికారి డా.రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్హతలు డిప్లమా ఇన్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్, డిప్లమా ఇన్ ఆప్తోమెట్రిక్ కోర్సులు, బీఎస్‌సీ ఆప్తోమెట్రిక్, విజువల్ సైన్స్, ఇంటర్మీడియట్ లో ఒకేషనల్ కోర్సు, ఆప్తాల్మిక్ టెక్నీషియన్ కోర్సులు చేసిన వారు టీఎస్ పారామెడికల్ బోర్డులో రిజిస్టర్ అయి ఉండాలని తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు బయోడెటా, తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్ తీసుకోని రావాలని కోరారు. వీటికి సంబందించిన మెరిట్ లిస్టు 6/10/2022 రోజున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తెలుపబడును. ఫైనల్ లిస్టు 7/12/2022 రోజున అపాయింట్‌మెంట్ ఆర్డర్ కూడా అదే రోజు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. జాయినింగ్ తేది 9/12/2022న సాయంత్రం 5గంటల లోపు ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలిపారు.

## తెలంగాణ ఉద్యమ కెరటం శ్రీకాంతాచారికి ఘన నివాళి

**కొత్తకోట,డిసెంబర్ 3 ప్రభాతవార్త:** శ్రీకాంతాచారి 13వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని చౌరస్తాలో ఆయన చిత్రపటానికి శనివారం జడ్పీవైస్ ఛైర్మన్ వామన్ గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక పూలమాల వేసి నివాళి అర్పించారు. మలిదశ ఉద్యమకారుడు శ్రీకాంతాచారి అని ఆయన తెలంగాణ కు చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని జడ్పీవైస్ ఛైర్మన్ అన్నారు. అలాగే స్వర్ణకార సంఘం గౌరవ అధ్యక్షులు ఆనంద్‌చారి ఆధ్వర్యంలో శ్రీకాంతాచారి వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుకేషిని, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి ప్రశాంత్, సింగిల్‌విండో ఛైర్మన్ వాసుదేవా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, శ్రీనుజీ, అయ్యన్న, రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మునగారి కృష్ణ, వికాస్, చింటు, కళ్యాణ్, రవి కుమార్, వెంకటయ్య చారి, అరుణ్ కుమార్, కృష్ణయ్య చారి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమైక్య భవనం తలుపులు ధ్వంసం

**ఖిల్లాఘణపురం,డిసెంబర్3, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మమిళా సమైక్య భవనం తలుపులను శుక్రవారం రాత్రి ధ్వంసం చేసినట్లు ఏఎస్ఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఐకెపీఎపీఎం నాగమణి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రం కార్యాలయ సిబ్బంది విధులు ముగించుకొని వెళ్లేటప్పుడు తలుపులు తాళం వేసినట్లు తెలిపారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పెద్దపెద్ద బండరాళ్లతో భవనం తలుపులను పగల గొట్టారని అన్నారు. భవనానికి గల రెండు తలుపులను ధ్వంసం చేశారని అన్నారు. ఐకెపీ భవనం తలుపులు పగలకొట్టిన వారు తాగుబోతులు ఆకతాయిలు అయి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏఎస్ఐ సత్యనారాయణ గౌడ్ ను వివరణ కోరగా భవనం తలుపులు బద్దలు కొట్టిన వారిని గుర్తిస్తామని అన్నారు.

## సిఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల చిత్రపటానికి క్షీరాభిషేకం

**కొత్తకోట,డిసెంబర్3 ప్రభాతవార్త:** దివ్యాంగులకు ప్రత్యేక శాఖ చేసినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి చిత్రపటాలకు శనివారం వికలాంగుల పునరావాస కేంద్రంలో దివ్యాం గులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల హరీష్ రెడ్డి మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ నుండి విభజిస్తూ తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులకు ప్రత్యేక శాఖను ఏఆర్పాటు చేస్తూ ఉత్త ర్వులు జారీ చేసిందని అన్నారు. దీంతో దివ్యాంగులు వయోజనులకు ప్రత్యేక శాఖ ఏర్పాటు కాను న్నదని, ప్రత్యేకశాఖ లో వారి సంక్షేమానికి సత్వరమే నిర్ణయం తీసుకునే వెసులుబాటు ఉంటుందని దివ్యాంగుల సంక్షేమ శాఖను స్వతంత్ర శాఖగా ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా క్షీరాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభు స్వామి, ప్రభాకర్ శెట్టి, కృష్ణయ్య గౌడ్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.



## న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**● ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రజిని**

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 3 ప్రభాతవార్త:** న్యాయ స్థానాల ద్వారా మండల న్యాయ సేవాధికారి సంస్థ వనపర్తి ఆధ్వర్యంలో అందించే ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి సీనియర్ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి.రజిని అన్నారు. ఈ మేరకు శనివారం పెద్దమండడి మండల కేంద్రంలో ఎస్టీ బాలికల విద్యాలయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి రజిని మాట్లాడుతూ న్యాయ స్థానాల ద్వారా ప్రజలందరికి న్యాయ సేవలు అందాలన్నది లక్ష్యమని లోక్‌అదాలత్ పని చేస్తుందని ఆమె వివరించారు. ఎస్సీ,ఎస్టీ వయోవృద్ధులు, మహిళలు రూ.3లక్షల లోపు అల్ప ఆదాయం ఉన్నవారికి ఉచిత న్యాయసేవలు ఈ సేవలు అర్హులైన ప్రజలు ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని విద్యాభ్యాసం చేస్తే ఆశించిన గమ్యాన్ని చేరుకోవచ్చునని సూచించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం సాధించాలన్న పట్టుదల అలవడాలని వివరించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల వసతులను పరిశీలించారు.అనంతరం వనపర్తి అదనపు జూనియర్ పివిల్ కోర్టు న్యాయమూర్తి బి.రవికుమార్ విద్యార్తులకు పలు సూచనలు చేశారు. పట్టుదలతో శ్రమించాలని, సమాజంలో ఉన్నత శిఖరాలను అదిరోహించడానికి పట్టుదలతో శ్రమించాల్సిన అవసరం ఎంతైన ఉందని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం వనపర్తి లోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మహిళా శిశు,దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి వారు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌షేక్ యాస్మిన్ భాష,డీడబ్ల్యూఓ పుష్పలత, జేసీ,మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రజిని

## రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా రాజీలేని పోరాటం

**బీసీ విద్యార్థి యువజనుల పోరు యాత్రలో జాతీయ బీసీ సంఘం నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్**

**కొత్తకోట,డిసెంబర్3 ప్రభాతవార్త:** కొత్తకోట బీసీ విద్యార్థి యువజనుల పోరుయాత్ర పాలమూరు నుండి పట్నం దాకా జరిగే ఈ యాత్రలో భాగంగా శనివారం కొత్తకోట చౌరస్తాలో భారీగా విద్యార్థి యువజనులు తరలివచ్చి విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాలపై ధ్వజమెత్తారు. విద్యార్థులకు సకాలంలో స్కాలర్ షిప్స్ రావడంలేదని ఫీజు రియంబర్స్‌మెంట్ సకాంలో చెల్లించాలని హాస్టల్ లో ఉండే విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, యువజనులకు ఉద్యోగ కల్పన 90% సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని ఆయన ధ్వజమెత్తారు. బీజీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బాలరాజు గౌడ్ మాట్లాడుతూ పోరుయాత్ర 33జిల్లాలు 80 నియోజకవర్గాల్లో జరిగే ఈ యాత్రకు యావత్ బీసీ విద్యార్థి యువజనులు బీసీ కులాలకు సంబందించిన ప్రతి ఒక్కరు ఈ యాత్రకు సహకరించాలని ఆయన కోరారు. కొత్తకోట గడ్డ బీసీల అడ్డా బీసీల చదువు కోసం సామాజిక న్యాయం కోసం నా తుది శ్వాస వరకు చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా రాజీలేని పోరాటినికై సమిష్టి కృషితో అడుగులు వేస్తామని బీసీ యువజన విద్యార్థి ఫోర



మాట్లాడుతున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్

యాత్ర కొత్తకోట సభలో జాజుల శ్రీనన్న అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ భీమన్న నాయుడు, విద్యార్థి కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్‌గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్రఅధ్యక్షులు కనకాలశ్యామ్ కురుమ,బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనన్న, బీసీ యువజన సంఘం నాయకులు బండిగారి రాజు, పానుగంటి విజయ్ కుమార్, మహేష్ గౌడ్,అశోక్ కుమార్, మహిళా సంఘం అధ్యక్షురాలు మనీ, అంజలి, రాఘవేందర్, జనార్దన్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలి

**● జడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక**

**కొత్తకోట,డిసెంబర్3 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని జడ్పీవైస్ చైర్మెన్"వామన్ గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక లు పిలుపునిచ్చారు. శనివారం కనిమెట్ట, నాటవెల్లి తాండా, పామాపురం గ్రామాలతో పాటు నాచారంపేట గ్రామంలో వారుపర్యటించి మాఆట్లడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనివినీ ఎరుగనీ రీతిలో సభకు తరలిరావాలని, సంక్షేమ పథకాలు అందుతున్న వారిని ఇంటింటికి తిరిగి తరలించాలని సూచించారు. అలాగే పట్టణంలో యూత్ విభాగం ఆధ్వర్యంలో యువజన నాయకులకు ముఖ్యమంత్రి సభకు తరలి వెళ్లాలని ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి ప్రశాంత్, జిల్లా నాయకులు శ్రీను జీ లు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ సుకేషిని, డీసీసీబీ డైరెక్టర్ వంశీధర్ రెడ్డి, సీడీసీ చైర్మెన్ చెన్నకేశవ రెడ్డి, సింగిల్‌విండో చైర్మెన్ తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ ప్రదర్శన

**అయిజ,డిసెంబరు 3 ప్రభాతవార్త:** పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా ఎంతో అట్టహాసంగా నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ వైజ్ఞానిక గణిత, పర్యావరణ ప్రదర్శనలు శనివారం ముగిశాయి. ఇందులో భాగంగా చివరి రోజు జిల్లా అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్ హాజరై ఇన్స్పైర్ ప్రదర్శనలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రయోగాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వారి నైపుణ్యాలను ప్రదర్శించారని వారి ప్రయోగాలు వారి ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు ఈ ప్రదర్శనలు దోహదపడతాయని అన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి మహ్మద్ సిరాజుద్దిన్, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేశారు. ఇందులో పట్టణానికి చెందిన బ్రైస్టార్ పాఠశాల విద్యార్థిని వి. క్రిస్టోలైట్ మొదటి బహుమతి సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చిన్నదేవన్న, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంఈఓ నరసింహులు, ఉపాధ్యాయులు తిమ్మారెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, ఏబెల్, రవింద్రతో పాటు ఆయా పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే చివరి రోజు సందర్శించిన వారిలో మాజీ ఎంఈఓ ఎన్ఐ మేరమ్మ, టిఆర్ఎస్ జిల్లా మహిళా నాయకురాలు రంగు సుమలతలు ఉన్నారు.

## ఘనంగా మల్దకల్ శ్రీతిమ్మప్పస్వామి ధ్వజారోహణం

**మల్దకల్,డిసెంబరు 3 ప్రభాతవార్త :** మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో శనివారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఆగమ పద్ధతిలో వేద పండితులు రమేష్ ఆచారి, రవి శ్రీధర్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దేవాలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డిలు పూజలు నిర్వహించి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించగా పలువురు భక్తులు హాజరై ఉత్సవాలను తిలకించారు. సంతానం లేనివారు ఈ ఉత్సవానికి హాజరై స్వామివారి ప్రసాదం స్వీకరించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను సూర్యప్రభ వాహనంలో ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, బాబురావు,నందిని ప్రకాష్‌రావు, భీవసేనచారి, సంజీవ్‌భరద్వాజ్,అరవిందరావు,నాగరాజుశర్మ, పద్మారెడ్డి ,వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.



## మనోధైర్యంతో ముందుకు సాగాలి

**దేవరకద్ర,డిసెంబరు 3 ప్రభాతవార్త:** దివ్యాంగులు ఆత్మస్థైర్యం, మనోధైర్యంతో ముందుకు సాగాలని జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త అశ్విని చంద్రశేఖర్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో వికలాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటి (ఎస్ఎంసి) గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో విద్యావాలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న విద్యాభిమాని వెంకట్రాములును శాలువా, పూలమాలలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ సకలాంగులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న దివ్యాంగులను ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని కోరారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జి.వెంకటేశ్వర్లు,ఉన్నతపాఠశాల హెచ్ఎం మురళీధర్,ఉపాధ్యాయులు బాసిద్, కల్పన, రజియాబేగం, ఆంజనేయులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లా డయాగ్నోస్టిక్ సెంటర్ నూతన కమిటీ ఎన్నిక

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 3 ప్రభాతవార్త:** డయాగ్నోస్టిక్ సెంటర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. శనివారం జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నుకోబడిన డయాగ్నోస్టిక్ సెంటర్ అసోసియేషన్ నూతన కమిటీని అభినందించిన మంత్రి నిరంజన్‌రెడ్డి. అధ్య క్షునిగా అక్కల తిలకేశ్వర్‌గౌడ్, గౌరవాధ్యక్షులుగా తిరుపతి రెడ్డి, మిస్‌బహుద్దీన్, ఉపాధ్యక్షులు అల్తాఫ్, నరేష్ గౌడ్, తిరుపతి రెడ్డి, జనరల్ సెక్రటరీ యూసూఫ్, అజీమ్, ట్రెజరర్ శ్రీకర్ రెడ్డి, మీడియా ఇన్చార్జ్ నాగిరెడ్డి, జాయింట్ సెక్రటరీలు అంబాజీ రావు, కిరణ్ గౌడ్, సభ్యులు సర్వర్,శ్యామ్, మంసూర్, ముక్తార్, రాము, మధు, శ్రీకాంత్, సాయికుమార్, నరేష్ కుమార్ లకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనం తరం నూతనంగా ఎన్నుకున్న డయాగ్నోస్టిక్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు.



## ఘనంగా స్వాగతోత్సవ వేడుకలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా తెలిపారు. ఫ్రెషర్స్ డే వేడుకల పట్ల విద్యార్థుల్లో మంచి సృజనాత్మకతను వెలికితీయడంతో పాటువారు ఉత్సాహంగా ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడుతాయన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు మొదటి సంవత్సర విద్యార్థులకు స్నేహ పూర్వక వాతావరణంలో స్వాగతం చెప్పడం ద్వారా విద్యార్థుల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. కళాశాలలో విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారని, అనంతరం కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీలకు సంబంధించినటువంటి ఉత్తమ ప్రతిభ కనబరిచి విద్యార్థులకు అవార్డులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఖాజాబి, అధ్యాపకులు డాక్టర్ వర్కాల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## నామకరణ మహోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే

**కేటిదొడ్డి,డిసెంబర్3 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం కేటీదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో నామకరణ మహోత్సవం వేడుకలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చిన్నారిని అక్షంతలు వేసి ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయ్, జడ్పీటీసీలు రాజశేఖర్, పద్మ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు ఉరుకుందు, తెరాస పార్టీ నాయకులు చక్రధర్ రావు, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కురుమన్న, ఆంజనేయులు, నవీన్ రెడ్డి, రాజేష్, మండల పార్టీ అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అనూస్ స్కూల్ విద్యార్థి ఎంపిక

**వనపర్తి టౌన్,డిసెంబర్ 3 ప్రభాతవార్త:** ఈనెల 5,6వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగే ఎన్ఐడీజేఏఎం నేషనల్ ఇంటర్, డిస్ట్రిక్, సబ్ జూనియర్, జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు వనపర్తి జిల్లా తరుపున రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అనూస్ స్కూల్ విద్యార్థిని ఎన్.రవిత్రేని ఎంపికైనట్లు వనపర్తి జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు తెలిపారు. రవిత్రేని యు-12 కేటగిరిలో 100మీ. పాల్గొనసున్నట్లు ఆమె పర్సనల్ కోచ్ రాచూరి అశోక్ పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి స్కూల్‌కి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల యాజమాన్యం అరుణారెడ్డి, అనుజ్ఞ రెడ్డి, స్కూల్‌ఉపాధ్యాయులు,పీఈటీలు, రవిత్రేనికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా మాజీ రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ జయంతి

**ఖిల్లాఘణపురం,డిసెంబర్3 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రపతి డా.బాబు రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ అని 1950 నుండి 1962 వరకు రాష్ట్రపతి బాద్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. మహాత్మగాంధీ మద్దతుదారునిగా 1931లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం,1941లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలు శిక్ష అనుభవించాడని తెలిపారు. 1957లో రెండవసారి రాష్ట్రపతిగా ఎన్నికై రెండుసార్లు భారత రాష్ట్రపతిగాపదవినలంకరించిన ఏకైక వ్యక్తిగా చరిత్రలో నిలిచాడని దేశానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.ఈకార్యక్రమంలోఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**వనపర్తి రూరల్,డిసెంబర్ 3 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యరకమంలో సీఎమ్ఓ యుగేంధర్, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, కేడీఆర్ పాఠశాల ఉపాధ్యాయులు వెంకటయ్య, ఐఈఆర్‌పీ ఉదయ్,ఉమ,విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సందర్భంగా సీఎమ్ఓ యుగంధర మాట్లాడుతూ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎంతో మంది దివ్యాంగులైన వారు గొప్ప శాస్త్రవేత్తలు, వ్యాఆపారవేత్తలు, రాజకీయ నాయకులు అయ్యారని, విద్య ద్వారానే వారు ఉన్నత శిఖరానికి చేరుకోగలిగారని, ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు అనేక పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని ద్వారా వారుఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలియజేశారు. ఎమ్ఈఓ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దివ్యాంగులపట్ల ప్రేమ, ఆప్యాయత, అనురాగం పంచాలని వారి చేయూతను అందించాలని వివక్షత చూపించరాదనివాళ్లు కూడామనతో సమానమేననిఅన్నారు. అంతకుముందు ఐఈఆర్‌పీలు విద్యార్థుల తల్లిదండ్రులకుఅవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిప్రభుత్వం అందిస్తున్నకార్యక్రమవివరాలను, దివ్యాంగులుగా పుట్టడానికిగలకారణాలు,తీసుకోవాల్సి నజాగ్రత్తలు తెలిపారు.

**ఖిల్లాఘణపురం,డిసెంబర్3 ప్రభాతవార్త:**ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ ఇండియా సోషల్ మీడియా అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు.శాఖను ఏర్పాటుచేసిన తెలంగాణ సిఎంకేసీఆర్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు రమేష్,యాదయ్య,జగన్మోహన్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ నిధి ఈకేవైసీ చేయించుకోవాలి

**వెల్దండ,డిసెంబర్ 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అర్హులైన రైతులు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం క్రింద అర్హులైన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి మంజుల తెలిపారు. వెల్దండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం ఈకేవైసీ సమ్మాన్ పథకాన్ని గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డితో కలిసి ఏఓ మంజుల అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మంజుల మాట్లాడుతూ 9068 మంది రైతులు అర్హులుగా ఉన్నారని, వీరిలో 3523 మంది ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకోలేదని, రైతులు అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. మిగతా వివరాలకు వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి గిరి, వార్డు సభ్యులు రంగయ్య, నాయకులు క్యాసరపు వెంకటయ్య, బాలరాజు, మల్లేష్, మల్లయ్య తదితరులు ఉన్నారు.